www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
మంగళవారం 13 జూన్ 2023
1

గర్భిణులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గుంజాల సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాల గర్భిణులకు సోమవారం పీహెచ్‌సి వైద్యుడు డా.రాంబాబు రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పౌష్టికాహార లోపాలకు తీసుకునే జాగ్రత్తలపై వివరించారు. సబ్ సెంటర్ పరిధిలోని మొత్తం 28రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసి ఉంచుకోవాలని ఏఎన్‌ఎంలను ఆదేశించారు. ప్రతి సోమవారం సబ్ సెంటర్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వారి వెంట వైద్య సిబ్బంది అవన్, హిమబిందు, చరణ్‌దాస్, అదీప్, విద్యారాణి, సత్యశీల, నాగుబాయి ఉన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

తలమడుగు : సీఎం కేసీఆర్ వికలాంగుల పెన్షన్‌ను రూ.1000 పెంచినందుకు సోమవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ తోట వెంకటేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు వికలాంగులను పట్టించుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ వికలాంగుల పరిస్థితి గమనించి వారికి సాయం చేయాలని పింఛన్ పెంచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఝరి పిఏసిఎస్ చైర్మన్ వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రకాష్, ఎంపిటిసి ఎలుగు చంటి, మహిళా అధ్యక్షురాలు రాంబాయి, జిల్లా రైతుబంధు డైరెక్టర్ సునీతరెడ్డి ,ఉపాధ్యక్షురాలు పల్లవి, బీఆర్ఎస్ నాయకులు సంతోష్, గజానన్, ఆనంద్, రాంకిషన్, నారాయణ, శేఖర్ పలువురు వికలాంగులు పాల్గొన్నారు.



బడి బస్సుకు భద్రత ఏదీ..?

- నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలు
- ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడంలో మీనమేషాలు
- సంపాదనే ధ్యేయం..విద్యార్థుల రక్షణ గాలికి
- ఫిట్‌నెస్ లేకుండానే రోడ్డెక్కుతున్న వాహనాలు
- ముగిసిన గడువు..అనేక బస్సులు దూరం

బడి బస్సుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడంలో కొన్ని ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు అలవిమాలిన నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న కొన్ని పాఠశాలలు..విద్యార్థుల ప్రాణాలను గాలికొదిలేస్తున్నాయి. పాఠశాల బస్సులను సామర్థ్య పరీక్షలు చేయించకుండా నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయి. ప్రమాదం జరగకముందే జాగ్రత్త పడాల్సిన యాజమాన్యాలు తీవ్ర అలసత్వం వహిస్తున్నాయి. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించేందుకు ఈ నెల 12వ తేదీ వరకే గడువు ఉండగా ఇప్పటి వరకు సగం బస్సులు కూడా పరీక్షలు చేయించలేదు. అనేక బస్సులు సామర్థ్య పరీక్షలకు రాకుండా అడ్డదారిలో ప్రయాణించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ నిబంధనలు ఉల్లంఘించిన వాటిపై కొరఢా ఝులిపించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. కేవలం వారం పాటు తనిఖీలు చేసి విడిచిపెడుతున్నట్లు విమర్శలున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

వేసవి సెలవుల అనంతరం బడులు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో అనేక ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు పిల్లలను ఇంటి నుంచి తీసుకొచ్చేందుకు ప్రత్యేకంగా బస్సులను కేటాయిస్తున్నాయి. ఉదయం పిల్లలను తీసుకురావడం.. సాయంత్రం ఇంటికి తీసుకెళు న్నాయి. ఇందుకు తల్లిదండ్రుల నుంచి రూ.వేలల్లో ప్రయాణ రుసుము వసూలు చేస్తున్నాయి. కానీ పిల్లలను తీసుకెళ్లాల్సిన ఈ బస్సులు ప్రతి ఏటా రవాణాశాఖ కార్యాలయంలో ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. బడులు తెరిచేనాటికి అన్ని రకాల పరీక్షలు, పత్రాలు అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. కానీ అనేక బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలకు రావడం లేదు.ఉమ్మడి జిల్లాలో ప్రయివేటు పాఠశాలల బడి బస్సులు 817 ఉండగా ఇందులో కేవలం 298బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నాయి. మిగిలిన 519 బస్సులు సామర్థ్య పరీక్షలకు దూరంగా ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో 145 బస్సులు ఉండగా కేవలం 66బస్సులు, మంచిర్యాలలో 361బస్సులకుగాను 131, నిర్మల్‌లో 224బస్సులకుగాను 94 బస్సులు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 87బస్సులు ఉండగా కేవలం 7 మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలకు హాజరయ్యాయి.





నిబంధనలు ఉల్లంఘన..!

బడి బస్సులు కనీస ప్రమాణాలు తప్పకుండా పాటించాలని రవాణశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. కానీ చాలా బస్సులు వీటిని పట్టించుకోవడం లేదు. స్కూల్ బస్ పేరు, కలర్, రిజిస్ట్రేషన్ వివరాలు, సీట్ల సామర్థ్యం, పుస్తకాలు పెట్టుకునేందుకు డెస్కులు, డ్రైవర్‌కు సంబంధించి ఆరోగ్య పరీక్షలతో పాటు అతనికి సంబంధించి అన్ని వివరాలు బస్సులో ఉండాలి. పిల్లలు తలలు బయటపెట్టకుండా గ్రిల్స్ ఉండటంతో పాటు సులువుగా ఎక్కి, దిగేందుకు పుట్‌బోర్డు ఉండాలి. బస్సు వెనకభాగాన అవసరమైన ఇండికేటర్లు తప్పనిసరిగా ఉండాలి. ఇలా రవాణశాఖ నిబంధనల ప్రకారం 32అంశాలు బస్సులో పాటించాల్సి ఉంటుంది. కానీ చాలా వరకు బస్సులు ఈ నిబంధనలను తుంగలో తొక్కుతున్నట్లు తెలుస్తోంది. ఈ శాఖ నిబంధనలు పాటించాలంటే డబ్బులు ఖర్చవుతాయనే ఉద్దేశంతోనే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించడం లేదని తెలుస్తోంది. ప్రతి ఏటా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండా రోడ్డెక్కిస్తున్నట్లు సమాచారం. అడపాదడప తొలి వారం పాటు తనిఖీలు చేపడుతున్న రవాణశాఖ అధికారులు.. తదనంతరం వాటిని పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్ని బస్సులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని తెలిసినా రాజకీయ ఒత్తిళ్లతో వాటి వైపు దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి.

రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటాం : పుప్పాల శ్రీనివాస్, డీటీసీ, ఆదిలాబాద్



ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోలేని బస్సులు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకపోయినా, డ్రైవర్లకు కనీస అనుభవం లేకపోయినా యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం.ఫిట్‌నెస్ పొందిన తర్వాతే బస్సులను రోడ్డెక్కించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలను ఆటోలో పరిమితికి మించి పంపించకూడదు. ఇటీవల బస్ డ్రైవర్లు, కళాశాల, పాఠశాల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాం.

బాల కార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాల కార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలించడానికి అధికారులు కృషి చేయాలని సిపిఐ (ఎంఎల్) రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి గోగర్ల తిరుపతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాల కార్మిక దినోత్సవం నేపథ్యంలో జిల్లాలో పూర్తిస్థాయిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలించడానికి అధికారులు కృషి చేయాలన్నారు. దేశంలో 2011 లెక్కల ప్రకారం నాలుగు శాతం బాలలు కార్మికులుగా ఉన్నారని గుర్తు చేశారు. దాన్ని సున్న శాతానికి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇటుక బట్టీలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్, ఇండ్లల్లో పని చేస్తుంటారన్నారు. బాల కార్మిక చట్టం కఠినంగా ఉన్నప్పటికీ దాని అమలు సరిగ్గా లేదన్నారు. బాల కార్మికులను పనిలో చేర్చుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటే మరొకరు ముందుకు రారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ భారత్ మహాసభ జిల్లా అధ్యక్షులు పెందూర్ రాజేష్, దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు దయాకర్ పాటిల్, నగేష్, అనిల్ పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన పాలిసెట్ టాపర్లకు సత్కారం



నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

పాలిసెట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కబనర్చిన విద్యార్థులను ఆదిలాబాద్ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో సత్కరించారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా టాపర్లు అయిన అమీనా షీరిన్, సమీక్ష, సరితను ప్రిన్సిపాల్ భరద్వాజ్ సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిసెట్ ప్రవేశ పరీక్షలో ఆదిలాబాద్ విద్యార్థులు జిల్లా టాపర్లుగా నిలవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు సురేష్ కుమార్, సుజయ్, సుధాకర్, సంగీత, జోత్స్యరాణి, రవికుమార్, రాజన్న, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-తలమడుగు

కుచులాపూర్ గ్రామానికి చెందిన దొడ రాములు కుమారుడు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో కుటుంబాన్ని ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు సోమవారం పరామర్శించారు. కుటుంబీకులతో మాట్లాడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట మండల కన్వీనర్ తోట వెంకటేశ్, మైతే ప్రభుదేవ్‌రావ్, భీంపూర్ కన్వీనర్ నాగయ్య, ఉపాధ్యక్షుడు మగ్గిడి ప్రకాష్, బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ రవీందర్, సల్ల సుధాకర్, జనార్ధన్, బుయ్యని గంగారెడ్డి, రాగి రాంకిషన్, మేకల వెంకన్న, నారాయణ ఉన్నారు.

మైనారిటీ నాయకున్ని పరామర్శించిన జడ్పిటీసి

కోడద్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు, మండల కోఆప్షన్ మెంబర్ బాబుఖాన్‌ను సోమవారం జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం ప్రమాదంలో చేతి విరగడంతో పరామర్శించి వివరాలు తెలుసుకున్నార. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు దేవిదాస్, పోశెట్టి, రాకేష్, కమలాకర్ ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా కిరణ్ ఏకగ్రీవం

నవతెలంగాణ - మందమర్రి

జిల్లా బీసీ సంక్షేమ సంఘం యువజన ఉపాధ్యక్షులుగా మందమర్రి పట్టణానికి చెందిన రాయబారపు కిరణ్ ఎన్నికయ్యాడు. కిరణ్ కొద్ది రోజులుగా బీసీ సంక్షేమ సంఘం మందమర్రి పట్టణ ప్రధాన కార్యదర్శిగా వివిధ కార్యక్రమాలు చేస్తుండడంతో జిల్లా యువజన సంఘంలో ఆయన సేవలు కొనసాగించాలని ఏకగ్రీవంగా యువజన ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నీల కంతేశ్వర్, జిల్లా యువజన అధ్యక్షులు రాంశెట్టి నరేందర్, మందమర్రి పట్టణ అధ్యక్షుడు కోండిల్ల శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. పదవికి న్యాయం చేస్తానన్నారు. ఎలాంటి సమస్య అయినా యువత పోరాటాల వల్లనే సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బిసి యువజన సంఘం రాష్ట్ర నాయకులు ఉదారి చంద్రమోహన్‌గౌడ్, బండి మల్లికార్జున్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్, అధికార ప్రతినిధి సాగర్ యాదవ్, నాయకులు శ్రీనివాస్, నల్ల రవి, జమాల్, అశోక్, చోటు అయాన్, వినయ్, సమీర్ పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

నర్సాపూర్(జి) మండలంలోని రాంపూర్ గ్రామంలో ఎర్రకుంట చెరువులో సోమవారం ఇష్టారీతిన మొరం తవ్వకాలు చేపట్టారు. చెరువులో లోతైన గుంతలు తోడుతున్న విషయం తెలుసుకున్న అధికారులు అక్రమ మొరం తరలింపును నిలిపేశారు. అక్రమంగా మొరం తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీకాంత్ పేర్కొన్నారు.

రన్నింగ్‌తో శారీరక దృఢత్వం

- ఆసిఫాబాద్ కలెక్టర్ బోర్కడే హేమంత్
- పోలీసుల ఆధ్వర్యంలో 2.5కే రన్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రన్నింగ్ పోటీలతో యువతలో శారీరక దృఢత్వం పెరుగుతుందని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఎస్పీ సురేష్ కుమార్ అధ్యక్షతన ఏఆర్ హెడ్ క్వార్టర్స్ వద్ద నుండి ప్రారంభించిన 2.5కే రన్ పోటీలకు అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్‌పాయిలతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. పోటీల అనంతరం ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, ఈ పోటీలు దానికి ఉపయోగపడతాయన్నారు. పోలీసులు శారీరకంగా దృఢంగా ఉండడం ఎంతో ముఖ్యమని, జిల్లాలో పోలీసులు అందరూ ఫిట్‌గా ఉన్నారని దీనికి ఎస్పీ కృషి కూడా ఎంతో ఉందని అన్నారు. ఇలాంటి పరుగుపందెంలో యువతను పాల్గొనేలా చేయడం గొప్ప విషయమని తెలిపారు. యువత ఇదే స్ఫూర్తిని ప్రతి పోటీలో కొనసాగించాలని సూచించారు. ఎస్పీ సురేశ్ కుమార్ మాట్లాడుతూ పరుగు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని, ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా చూస్తుందన్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా యువత రన్నింగ్ చేయాలన్నారు. తాను ప్రతి రోజు తప్పకుండా 10 కిలోమీటర్లు పరిగెత్తుతానని తెలిపారు. జీవితంలో ఆస్తులు సంపాదించడం తేలికే కానీ ఆరోగ్యం సంపాదించడం కష్టమని, యువత దాన్ని సాధించుకోవడానికి కృషి చేయాలన్నారు. 2.5కె రన్‌లో పాల్గొన్న యువతకు అభినందనలు తెలిపారు. అంతకుముందు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నుండి ప్రారంభమైన 2.5కె రన్ బస్టాండ్, చిల్డ్రన్ పార్క్ మీదుగా ఏఆర్ హెడ్ క్వార్టర్స్ వరకు సాగింది. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ గాదవేని మల్లేష్, డిఎస్‌పి శ్రీనివాస్, సీఐ రాణాప్రతాప్, డివిజన్ పరిధిలోని పోలీసులు పాల్గొన్నారు.



విజేతలు వీరే..

పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన 2.5కే రన్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విజేతల్లో పురుషుల విభాగంలో పిప్రె నాగార్జున, పిప్రే శ్రీనివాస్, కిరణ్, మహిళా విభాగంలో జంగుబాయి(టిటిడబ్ల్యూఆర్జెసి), దివ్య జ్యోతి (టిటిడబ్ల్యూఆర్జెసి), పోలీస్ విభాగంలో తిర్యాణి ఎస్సై చుంచు రమేశ్, జైనూర్ సీఐ రామకృష్ణ విజేతలుగా నిలిచారు.

డీఈఓ పాఠశాలల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని వడ్యాల్ జిల్లా పరిషత్ పాఠశాల, పీచర ప్రాథమిక పాఠశాలను సోమవారం జిల్లా విద్యాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. వడ్యాల్ ఉన్నత పాఠశాలలో మన ఊరు మనబడి పనులను పరిశీలించారు. ప్రతి తరగతి గదిలో జరుగుతున్న పనుల గురించి సిబ్బందికి సూచనలు చేశారు. 2023-24 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్య పుస్తకాలను జిల్లా విద్యాధికారి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. పీచర ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు, భోజనం నాణ్యత, రుచి, సమయ పాలన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ గురించి ఆరా తీశారు. సిబ్బంది అమలు చేస్తున్న విధానాలు పట్ల విద్యాధికారి పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది, సీఆర్పి సుధాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ తగిలి గేదెలు మృతి

నవతెలంగాణ - దహెగాం

మండలంలోని చిన్నఐనం గ్రామంలో విద్యుత్ షాక్ తగిలి రెండు గేదెలు మృతి చెందాయి. హేమ శంకరయ్య, జంగిటి పర్వతాలుకు చెందిన గేదెలు గ్రామంలోని ఇండ్ల సమీపంలో మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్టు బాధితులు పేర్కొన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే రెండు గేదెలు మృతి చెందాయని, ఇండ్ల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నప్పటికీ దానికి కంచె ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదం చోటుచేసుకుందని ఆరోపించారు. ఒక్కో గేదె విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ఆర్థికంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదకోవాలని కోరారు.

బీసీల ప్రోత్సాహక పథకంలో గౌడ గీత కార్మికులను చేర్చాలి

- మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులుగౌడ్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలకు ప్రవేశపెట్టిన లక్ష రూపాయల ఆర్థిక ప్రోత్సాహ పథకంలో గౌడ గీత కార్మికులను చేర్చాలని మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసరి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మగోని శంకర్‌గౌడ్ గౌడ గీత కుల ప్రతినిధులతో కలిసి తాటి కమ్మలతో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ బోర్కడే హేమంత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వం బిసి కుల వృత్తులకు ప్రవేశపెట్టిన లక్ష రూపాయల ఆర్థిక సహాయ పథకంలో గౌడ గీత కార్మికులను చేర్చకపోవడం దారుణమన్నారు. ఇప్పటివరకు గౌడుల ఆర్థిక అభివృద్ధి కోసం ఎలాంటి పథకాన్ని ప్రవేశ పెట్టలేదని అన్నారు. ఏజెన్సీ మండలాల్లో గౌడ కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఏవి కూడా వర్తించకుండాపోవడం దురదృష్టకరమని తెలిపారు. ఏజెన్సీ మండలాల్లో గీత వత్తి మీద ఆధారపడి బతుకుతున్న గీత కార్మికులను ఎస్టీలుగా గుర్తించి ఏజెన్సీలో గీత కార్మికుల లైసెన్సులు పునరుద్ధించాలని కోరారు. ప్రభుత్వం మద్యం దుకాణంలో 50 శాతం దుకాణాలను గౌడ కులస్తులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గీత వృత్తి లైసెన్స్ కోసం అప్లై చేసుకున్న వారికి నెల రోజుల్లోనే లైసెన్సులు ఇవ్వాలన్నారు. జిల్లాలో గౌడ ఆత్మగౌరవ భవనానికి ఐదు ఎకరాల భూమితో పాటు జిల్లా కేంద్రంలో నీరా కేఫ్‌లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మోకు దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాళ్ల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు శేఖర్ గౌడ్, రమేష్ గౌడ్, మండల అధ్యక్షులు ఆకుల గిరిగౌడ్, నిమ్మల మహేష్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చేపూరి నవీన్‌గౌడ్, కాగజ్‌నగర్ మండల అధ్యక్షులు రామాగౌడ్, తిర్యాణి మండల అధ్యక్షులు జుంగోని అశోక్‌గౌడ్, ఈజ్గాం గౌడ సంఘం అధ్యక్షుడు తిరుపతిగౌడ్, రెబ్బెన మండల సోషల్ మీడియా కన్వీనర్ కేసరి రమేష్‌గౌడ్, తిర్యాణి యూత్ అధ్యక్షులు బొంగోని సాగర్‌గౌడ్, రెబ్బెన మండల యూత్ అధ్యక్షులు కొయ్యడ రవిగౌడ్ పాల్గొన్నారు.

పేదలు ఆత్మగౌరవంతో బతకాలన్నదే సీఎం కేసీఆర్ ఆలోచన

త్వరలో సామూహిక డబుల్ బెడ్‌రూమ్ ప్రవేశాలు : మంత్రి అల్లోల

నవతెలంగాణ-నిర్మల్

పేదలు ఆత్మగౌరవంగా బతకాలన్నదే సీఎం కేసీఆర్ ఆలోచన అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో బంగల్‌పేట్, నాగనాయిపేటలో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణం పనులు పూర్తి కావడంతో మంత్రి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిర్మల్ నియోజకవవర్గంలో దశలవారీగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. మౌలిక సదుపాయాలు పూర్తి కావడంతో విడతల వారీగా గృహ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీంతో అర్హులైన ప్రతి నిరుపేదకు సొంతింటి కల సాకారం కాబోతుందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని నాగనాయిపేట్‌లో రూ.54.24 కోట్ల వ్యయంతో నిర్మించిన 1,014, బంగల్‌పేట్(ఖురాన్‌పేట్)లో రూ.23.86 కోట్ల వ్యయంతో నిర్మించిన 446, మొత్తం రూ.78 కోట్ల వ్యయంతో నిర్మించిన 1460 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. త్వరలో సామూహిక గృహ ప్రవేశాలకు ముహూర్తం ఖరారు చేయనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక కూడా పూర్తైందని, వారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పారు. అదేవిధంగా సిద్దాపూర్‌లో 600 డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. మంత్రి వెంట కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

బీసీ సెల్ చైర్మన్ భోజన్నకు సన్మానం



ఇచ్చోడ : బోథ్ నియోజకవర్గ బీసీ సెల్ చైర్మన్ భోజన్నను కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్ పార్టీ నాయకులతో కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా గజేందర్ మాట్లాడుతూ చైర్మన్ అయిన తర్వాత మొదటిసారిగా ఇచ్చోడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వచ్చారన్నారు. అన్ని వర్గాల వారు, రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్ ఖాన్, బోథ్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుర్మే మహేందర్, నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మన్ ముస్తఫా, సీనియర్ నాయకులు షేక్ ముస్తాక్, షేక్ మహిబూబ్, అనిల్, షేక్ బాబా పాల్గొన్నారు.

నేడు పట్టణంలో పరిశ్రమల స్థాపనపై అవగాహనా సదస్సు

ఆదిలాబాద్‌టౌన్ : రాష్ట్రంలో యువత పారిశ్రామికవేత్తలుగా రాణించాలనే ఉద్దేశంతో భారత చిన్నపరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (ఎస్‌ఐడిబిఐ) వారి సౌజన్యంతో, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంఎస్‌ఎంఈ (ఎన్ఐ-ఎమ్ఎస్ఎంఈ) ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు ప్రోగ్రాం డైరెక్టర్ డా.నవీన్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 13న పట్టణంలోని యాదవ సంఘ భవనంలో పరిశ్రమల స్థాపనపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో పెట్టుబడికి అనువైన యూనిట్లు, ప్రభుత్వ పథకాలపై అవగాహనా కల్పిస్తామన్నారు. ఈ సదస్సుకు హాజరైన వారిలో 30 మంది ఔత్సాహికులను గుర్తించి వారికి ఈ నెల 14 నుండి 16 వరకు పరిశ్రమల స్థాపనకు తగిన శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఔత్సాహికులు ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 9849398589, 9390989082 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

నిర్మల్ : నిర్మల్ నియోజకవర్గానికి చెందిన 46 మందికి మంజూరైన రూ.20లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కౌన్సిలర్ లెక్కల నరహరి, లబ్ధిదారులు ఉన్నారు.

ముదిరాజ్‌లకు బీసీ రుణాలివ్వాలి

నవతెలంగాణ-తాంసి



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన కుటుంబాలకు అందిస్తున్న బీసీ రుణాలను ముదిరాజ్ కులస్తులకు అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో ముదిరాజ్ కుటుంబాలు తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు పొచ్చన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన కులాలకు లక్ష బీసీ రుణాలను అందించడం జరుగుతుందని అన్నారు. అందులో ముదిరాజ్ కులస్తులకు అవకాశం లేదని అన్నారు. ముదిరాజ్ కుటుంబాలు నిరుపేద వెనుకబడిన కులం అన్నారు. ముదిరాజ్ కుటుంబాలకు కూడా బీసీ రుణాలకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు రాఘవేంద్ర, గుగ్గిల జీవన్, రమాకాంత్, శ్రీనివాస్, సాయి ఉన్నారు.

ప్రమాదవశాత్తు గడ్డి వాము దగ్ధం

నవతెలంగాణ-బాసర



మండల కేంద్రంలోని పోచమ్మ గల్లీలో సోమవారం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని గడ్డివాము దగ్ధం అయ్యింది. జిడ్డు సాయన్నకు చెందిన గడ్డివాముకు మధ్యాహ్నం మంటలు అంటుకోవడంతో గమనించిన స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో గ్రామపంచాయతీ నీటి ట్యాంకర్‌తో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. సమయానికి గ్రామపంచాయతీ నీటి ట్యాంకర్ రావడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

అదిలాబాద్ పట్టణంలోని రాంపూర్‌లో సోమవారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ గురించి వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పలంటే కాంగ్రెస్‌ను గెలిపించాల్సిన అవసరం ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500కు గ్యాస్ సిలిండర్, ఇల్లు లేని పేదలకు రూ.5లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, రైతులకు ఎకరానికి రూ.15 వేలు రైతుబంధు, రూ.2లక్షల రుణమాఫీని చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఓబీసీ జిల్లా అధ్యక్షులు అంబకంటి అశోక్, వసీం, కన్య ప్రభాకర్‌రెడ్డి, నాయిని సుదర్శన్, మూర్తుజా, మహేందర్‌రెడ్డి, నర్సింలు, అన్నం ప్రభాకర్, రవి, విఠల్, సమిఉల్లా, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత బస్‌పాస్ సేవలు ప్రారంభం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

నూతన విద్యా సంవత్సరం ఆరంభంతో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉచిత బస్‌పాస్ సేవలు సోమవారం ప్రారంభించినట్లు నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న తెలిపారు. 12 సంవత్సరాలలోపు బాలురకు, పదవ తరగతి వరకు బాలికలకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని బస్ స్టాండ్‌లో సేవలు ప్రారంభించినట్లు తెలిపారు. సంబంధిత విద్యాసంస్థల ద్వారా రాయితీ బస్‌పాస్‌ల కొరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మేనేజర్ కార్యాలయంలో గాని, జిల్లా కేంద్రంలోని బస్‌స్టాండ్‌లో గాని సంప్రదించాలని పేర్కొన్నారు.

బీసీ అన్ని కులాల వారికి రుణాలందించాలి

- బీసీ సంక్షేమ మండల అధ్యక్షులు మేకల రవికాంత్ యాదవ్
- తహసీల్దార్‌కు వినతిపత్రం



నవతెలంగాణ-తలమడుగు

రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తులతో పాటు అన్ని బీసీ కులాల వారికి రుణాలు అందించాలని సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ వనజారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షులు మేకల రవికాంత్ యాదవ్ మాట్లాడుతూ బీసీల్లో గల అన్ని వర్గాలకు ప్రభుత్వం రుణాలను అందించాలని అన్నారు. కులవృత్తులతో పాటు బీసీ కులాల్లో అన్ని వర్గాల ప్రజలకు రుణాలు అందజేయాలని తెలిపారు. దరఖాస్తుకు గడువును పొడగించాలని అన్నారు. కుల ధృవీకరణ పత్రాలు, ఆదాయ ధృవీకరణ పత్రాలను అధికారులు త్వరగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి వెంకన్న, అధికారప్రతినిధి గాజుల సాంబశివ్, తలమడుగు గ్రామ కమిటీ అధ్యక్షులు అసం రవీందర్, శశికాంత్ యాదవ్, వినోద్, శ్రీనివాస్, బ్రహ్మం వివిధ గ్రామాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ధ్వంసమైన శ్మశాన వాటిక నాణ్యతపై విచారణ జరిపించాలి



నవతెలంగాణ-ఖానాపూర్

చిన్నపాటి గాలి దుమారానికి ధ్వంసమైన శ్మశాన వాటిక నాణ్యతపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజుల సత్యం బీజేపీ పట్టణ అధ్యక్షులు నాయని సంతోష్ అన్నారు. సోమవారం స్మశాన వాటికను ఆయన పరిశీలించారు. గత రెండు రోజుల కింద గాలివానకు స్మశాన వాటిక ధ్వంసం అవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో స్మశాన వాటికను నాణ్యతలేని నామమాత్రపు పనులు చేసి రూ.62లక్షల నిర్మాణ బిల్లును తీసుకున్నారని అన్నారు. మున్సిపాలిటీ మొత్తం అవినీతికి అడ్డగా మారిపోయిందని గతంలో గ్రామపంచాయతీగా ఉన్నప్పుడే రూ.15లక్షలతో ఆ స్మశానవాటికను నిర్మించారని అన్నారు. మళ్లీ అదే నిర్మాణంపైన నామమాత్రం పనులు చేసి రూ.62లక్షల బిల్లును తీసుకున్నారని ఆరోపించారు. నిర్మాణం పూర్తి చేసుకుని సంవత్సరం కూడా గడవకముందే ఇలా చిన్నపాటి గాలికే కుప్పకూలిపోవడం ప్రజా ధనాన్ని వృధా చేయడమేనని అన్నారు. సంబంధిత కాంట్రాక్టర్లపైన విచారణ జరపాలని దోషులను శిక్షించి డబ్బులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్న ఎమ్మెల్యే మౌనంగా ఉండటంపై అనుమానం వ్యక్తం చేశారు. వైకుంఠధామంలో బోరు వేయలేదనీ, నల్లాలు బిగించలేదని అన్నారు. ఈ పనులు చేయకుండానే బిల్లులు ఎలా చెల్లిస్తారని అన్నారు. దీనికి సంబంధించిన అధికారులపై విచారణ జరిపి దోషులను శిక్షించాలని అన్నారు. అఖిల పక్షం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. తిరిగి ప్రజాధనాన్ని రికవరీ చేసి మళ్లీ దాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు.

పిల్లలు పాఠశాలలో ఉండాలి..

పనిలో ఉంటే నేరం..

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బడీడు పిల్లలు పాఠశాలలో ఉండాలని, పనిలో ఉంటే నేరమని జువెనైల్ జస్టిస్ బోర్డ్ చైర్‌పర్సన్, జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ మంజుల అన్నారు. సోమవారం బాలల అందరికీ సామాజిక న్యాయం, బాల కార్మికత అంతం అనే అంశంపై ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బాల రక్షాభవన్‌లో మహితా స్వచ్ఛంద సంస్థ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్యాతిథులుగా జువెనైల్ జస్టిస్ బోర్డ్ చైర్‌పర్సన్, జూనియర్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మంజుల హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథుల చేతుల మీదుగా పోస్టర్లు, స్టిక్కర్లు ఆవిష్కరించి, ప్రధాన కూడళ్లలో ర్యాలీ నిర్వహించి, ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడారు. 14 సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లలను ఏ రకమైన పనిలోనూ ఉంచరాదని, అలాగే 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లలతో ప్రమాదకరమైన పనులు చేయించరాదని అన్నారు. ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే ఆ యజమాని శిక్షార్హుడు అవుతాడని తెలిపారు. బడివయసు పిల్లలు బడిలో తప్ప ఏ రకమైన పనిలోనూ ఉండకూడదని తెలిపారు. జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ పిల్లలు ముఖ్యంగా చదువు మధ్యలో మానివేసిన వారు బాల కార్మికులుగా మారే అవకాశం ఉందని అలాంటి వారిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటే బాల కార్మికులుగా మారకుండా నివారించగలమని అన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు వెళ్లేలా చూడగలిగితే బాల కార్మికులుగా మారకుండా ఉంటారని అన్నారు. ఎవరైనా పిల్లలను దుకాణాలలో కానీ, పొలం పనిలో కానీ, ఫ్యాక్టరీలలో కానీ, హోటల్లో కానీ, మరి ఏ ఇతర పనులలో గాని నియమించుకుంటే వారికి శిక్ష తప్పదని తెలిపారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ సమితి (సీడబ్ల్యుసీ) చైర్మెన్ వెంకటస్వామి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, సభ్యులు దశరథ్, సమీరుల్లా ఖాన్, ఏఎల్ఓ వినోద్, రాజలింగు, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ తిరుపతి, సిబ్బంది, మహిత స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీకాంత్‌రావు, త్రివేణి, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి

- పింఛన్ పెంపుపై సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-నిర్మల్

దివ్యాంగుల అభ్యున్నతికి, సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ ఏర్పాటు చేసిన దివ్యాంగుల కృతజ్ఞత సభలో మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దివ్యాంగులకు పింఛన్‌ను రూ.4, 116 పెంచినందుకు గాను సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, దివ్యాంగులు పాలభిషేకం చేశారు. పింఛన్ పెంపుపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. పింఛన్‌ను రూ.4,116కు పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పాలకులు వృద్ధులకు కేవలం రూ.200, దివ్యాంగులకు రూ.500లు పింఛన్లు మాత్రమే ఇచ్చేవారని, సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మనకు మంచి రోజులొచ్చాయని అన్నారు. 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో రూ.200 పింఛన్‌ను రూ.1,000, దివ్యాంగుల పింఛన్‌ను రూ.500 నుంచి రూ.1,500 పెంచిందని, రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 1,000ల పింఛన్‌ను రూ.2,016, దివ్యాంగుల పింఛన్‌ను రూ.3,016 నుంచి రూ.4,016 పెంచిందన్నారు. అదేవిధంగా ఆసరా పింఛన్ల పెంపుతో పాటు ఫించన్‌దారుల వయోపరిమితిని 57 ఏండ్లకు తగ్గించారని వివరించారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా ఏ పనిచేయలేని దివ్యాంగులకు పింఛన్ సరిపోవడం లేదనే ఆలోచనతో మంచిర్యాల సభలో కేసీఆర్ అదనంగా వెయ్యి రూపాయలను పెంచుతున్నామని, వచ్చేనెల నుంచి అమల్లోకి వస్తుందని ప్రకటించారని అన్నారు. దేశంలోనే దివ్యాంగులకు అత్యధిక పింఛన్‌ను అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. తెలంగాణ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఆసరా పింఛన్లు ఈ స్థాయిలో ఇస్తున్నారా అని ప్రశ్నించారు. పేదలకు కళ్యాణలక్ష్మి, రైతుబంధు, దళితబంధు లాంటి పథకాలతో పేదలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

గోదాముల నిర్మాణాలకు భూమిపూజ

నవతెలంగాణ-తాంసి



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తాంసి రూ.40లక్షల నాబార్డ్ నిధులతో భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో తాంసి మండలంలోని గిరిగాం గ్రామంలో నిర్మించే గోదాముల నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. మొదటగా ముఖ్య అతిథులను గ్రామ సర్పంచ్‌లు ఇరువురిని పూలమాల శాలువాతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రైతులకు ఇబ్బంది కలగకుండా అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని అన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువుల ఇబ్బంది కలగకుండా గోదాములను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూస్తున్నామని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నాబార్డ్ నిధులతో ఒక్కో గోదాముకు రూ.20 లక్షల చొప్పున నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. దాదాపు ఆరు గోదాముల నిర్మాణానికి భూమిపూజలు చేశామని అన్నారు. మారుమూల గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. తొమ్మిది సంవత్సరాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియపరిచే బాధ్యత మన అందరిదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్, సర్పంచ్ గజానన్, ఎంపీపీ మంజుల శ్రీధర్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మెన్ ధనుంజయ్, డైరెక్టర్ సంజీవరెడ్డి, కేశవ్, రైతుబంధు కోఆర్డినేటర్ గోవర్ధన్‌రెడ్డి, మండల నాయకులు కృష్ణ, వెంకన్న, తులసిరామ్, ఉత్తం, నాగయ్య, గంగారాం ఉన్నారు.

వర్గీకరణ కోసం మరో పోరాటానికి సిద్ధమవ్వాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్



నవతెలంగాణ-ఉట్నూర్

ఈ పార్లమెంటు సమావేశాల్లో బీజేపీ ప్రభుత్వం వర్గీకరణ బిల్లుని ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగ కులస్థులను ఉద్యమంలో భాగస్వామ్యం చేసేందుకు కమిటీల ఏర్పాటును వేగవంతం చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో ఉద్యమాన్ని బలోపేతం చేయాలని అన్నారు. విద్యా, ఉద్యోగ రంగాలలో మాదిగ కులస్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగల అభివృద్ధి జరగలంటే ఎస్సీ వర్గీకరణ ఒక్కటే దానికి పరిష్కారమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, జిల్లా నాయకులు నవీన్, రవి, మహేష్, శీను, మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు నాతరి రాజు, ఎమ్మెస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రీకాంత్ ఉన్నారు.

వాసవీ వరల్డ్ స్కూల్‌ను ప్రారంభించిన మంత్రి



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రలోని నూతన కలెక్టరేట్ రోడ్డు పక్కన వాసవి వరల్డ్ స్కూల్‌ను సోమవారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం స్కూల్‌లో నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అధునాతన సౌకర్యాలతో ఈ పాఠశాలను నిర్మించిన వాసవి యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు వెళ్లాలని చిన్నారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, స్కూల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ



నవతెలంగాణ-బోథ్

ఎంపీపీ తుల శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకొని తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో విద్యార్థులకు క్రీడా సామాగ్రి క్రికెట్ బ్యాట్, వాలీబాల్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే సొసైటీ తరపున మండలంలోని పేద కుటుంబాలకు అనాథ పిల్లలకు తన వంతు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని అన్నారు. అనంతరం ఎంపీపీ తుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలను కేక్‌కట్ చేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ ప్రశాంత్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సొసైటీ సభ్యులు ఇర్ల అభిలాష్, అఖిల్, హరీష్, బిక్క లక్ష్మణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

ఈదురు గాలుల బాధితులకు పెందూర్ ప్రభాకర్ పరామర్శ



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని దస్నాపూర్ పంచాయతీ పరిధిలోని కోయల్‌పాండ్రిలో ఆదివారం వీచిన ఈదురు గాలుల భీభత్సంతో ఇండ్లు ధ్వంసమైన కుటుంబీకులకు ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పెందూర్ ప్రభాకర్ అన్నారు. ఆయన సోమవారం ఆ గ్రామాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాలకు పరామర్శించారు. ఈదురు గాలులతో ఇంటిపై కప్పు, రేకులు లేచిపోయిన కుటుంబీకులతో మాట్లాడారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. బాధిత కుటుంబీకులను ప్రభుత్వం తరపున ఆదుకోవాలని స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సిరాజుద్దిన్, కోసుబాయి, చిత్రు ఉన్నారు.

డంపింగ్ యార్డ్‌ను వేరే చోటుకు తరలించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ఎన్టీఆర్ గ్రౌండ్ పక్కన ఉన్న డంపింగ్ యార్డ్‌ను అక్కడి నుంచి తొలగించి వేరే చోటుకు మార్చాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పెందుర్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో ఎన్టీఆర్ నగర్ కాలనీ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. డంపింగ్‌తో పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌తో హనుమాన్‌నగర్, ఎన్టీఆర్‌నగర్ బోయవాడలకు చెందిన కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వర్షకాలంలో అనేకమంది రోగాల బారిన పడుతున్నప్పటికీ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. డంపింగ్ యార్డ్‌ను నివాసాలు లేని చోట ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు విజయ్, సునీల్, కాలనీ వాసులు ఉన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మించాలని వినతి

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో నాయీ బ్రాహ్మణుల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి సహకరించాలని సోమవారం ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా శ్యాంనాయక్‌కు ఆ సంఘం సభ్యులు కలిసి వినతిపత్రం అందించారు. ముందుగా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రేఖా నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు కథలాపూర్ నాగేందర్ మాట్లాడుతూ ప్రతి నాయి బ్రాహ్మణునికి ఎలాంటి షరతులు లేకుండా రూ.పది లక్షల రుణాలు ఇవ్వాలన్నారు. ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే మండల కేంద్రంలో బ్రాహ్మణుల కమిటీ హాల్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారని సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సంఘం మండల ఉపాధ్యక్షులు వెంకటరమణ ప్రధాన కార్యదర్శి మల్లిపెల్లి శేఖర్, మర్రిపెల్లి అంజన్న, వెంకటేష్, సత్తన్న, నరేందర్ పాల్గొన్నారు.

వడదెబ్బతో గుర్తుతెలియని వృద్ధుడు మృతి

నవతెలంగాణ-నస్పూర్

వడదెబ్బతో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన సోమావరం సిసిసి నస్పూర్ లోని నస్పూర్ గేట్ ఏరియా సమీపంలో చోటుచేసుకుంది. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నస్పూర్ గేట్ సమీపంలోని సాయిరాం మార్బుల్ షాప్ వెనకాల వేప చెట్టు కింద సుమారు 75 సంవత్సరాల పైబడిన వృద్ధుడు వడదెబ్బతో చనిపోయి ఉన్నాడని తెలిపారు. స్థానికులు సమాచారం అందించడంతో ఘటనస్థలికి చేరుకొని వివరాలు సేకరించామని పేర్కొన్నారు. మృతుడు తెల్లని ధోతి ఫుల్ బన్నీ ధరించి చేతిలో నడవడానికి ఉపయోగించే కర్ర ఉంది. బ్లూ కలర్ రబ్బర్ స్లిప్పర్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురిలో భద్రపరిచినట్లు తెలిపారు. ఇతన్ని గుర్తుపట్టిన వారు నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై పేర్కొన్నారు.

సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి
- నిబంధనలకు విరుద్ధంగా బుక్స్, యూనిఫామ్ అమ్మకం



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని పార్వతిపేట ప్రధాన రోడ్డులో గల సాయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్ ప్రయివేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ బృందం సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాలను సందర్శించగా నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేటు స్కూలులో బుక్కు, యూనిఫామ్‌లు అమ్ముతున్నట్టు గమనించారు. దీంతో వెంటనే సదరు ఎస్ఎఫ్ఐ నాయకుడు ఇక్కడ అమ్ముతున్న పుస్తకాలు, యూనిఫామ్‌ల గురించి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎలా అమ్ముతున్నారని ప్రశ్నించారు. పాఠశాలలోనే గది నిండా పుస్తకాలు నిల్వవుంచి అధిక ధరలకు



విద్యార్థులకు అమ్ముతూ విద్యార్థులను నిలువుదోపిడి చేయడం సరికాదని అనడంతో గదిలోకి అనుమతించలేదు. వెంటనే వారు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంఈఓను, డీఈఓకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్టు పేర్కొన్నారు. అంతేకాకుండా పాఠశాలలో అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. పాఠశాల ప్రారంభానికి వారం రోజుల ముందుగానే విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజ్ పెట్టి మరీ ఈ దందాకు పాల్పడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. విద్యారంగ చట్టానికి విరుద్ధంగా పనిచేస్తున్న పాఠశాలపై, అలాగే యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ చర్యలు తీసుకోని పక్షంలో జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి డోకె నవీన్, మండల నాయకులు ఋషి పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు వెళ్లిన వెంటనే పాఠశాల యాజమాన్యం గదిలో నిల్వవుంచిన పుస్తకాలను బొలేరో వాహనంలో నింపి సమీపంలోని ఓ కిరాణ దుకాణానికి తరలించడం గమనార్హం.

ప్రారంభమైన ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ పలు సెంటర్లను సందర్శించి సూచనలు సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మొదటి రోజు పరీక్షలకు ఉదయం జిల్లా వ్యాప్తంగా జనరల్ 555, ఒకేషనల్ 37 మొత్తం 592 మంది విద్యార్థులకు గాను జనరల్ 524, ఒకేషనల్ 31 మంది హాజరయ్యారని మొత్తం 37 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జనరల్ 103, ఒకేషనల్ 20 మొత్తం 123 మంది విద్యార్థులకు గాను జనరల్ 99, ఒకేషనల్ 18 మంది హాజరయ్యారని, మొత్తం 6మంది గైర్హాజరయ్యారన్నారు. పరీక్షల నిమిత్తం 8 పరీక్షా కేంద్రాలున్నాయని, అన్ని కేంద్రాలలో వైద్య సిబ్బంది, బందోవస్తు పోలీస్ సిబ్బంది ఉంచినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించడానికి డీఈసీ బృందం, 1 ఫ్లయింగ్ స్క్వాడ్ త్రిసభ్య టీం, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్‌లు పర్యవేక్షించినట్లు తెలిపారు. పరీక్షల సందర్భంగా జిల్లా స్థాయిలో డీఐఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసారని, హాల్ టికెట్ తదితర సమస్యలుంటే కంట్రోల్ రూం 08733-293713 నెంబర్‌కి కాల్ చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-భీమారం

మండల కేంద్రంలోని ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల బాలుర సమీకృత వసతీ గృహంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వసతి గృహ సంక్షేమాధికారి ఎన్.శ్రీసాయిలచ్చన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు వసతీ గృహంలో ఖాళీలను బర్తీ చేసేందుకు ప్రవేశ దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు అన్ని ఉచిత వసతులతో పాటు, ప్రతీ సబ్జెక్ట్‌పై పట్టు సాధించేందుకు రాత్రి సమయంలో ప్రత్యేక తరగతుల పర్యావేక్షణలో విద్యార్థులకు విద్యాబోధన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు పిల్లల ఆరోగ్యం పట్ల ఏఎన్ఎంలతో పర్యావేక్షణ ఉంటుందన్నారు. అదేవిధంగా పిల్లలకు అవసరమయయ్యే నోట్ బుక్కులు, వసతి సౌకర్యవంతమైన ట్రంక్ పెట్టె, కార్పెట్, బెడ్ షీట్, 4 జతల దుస్తులు, టవల్ వంటి పూర్తి అవసరమయ్యే సామాగ్రి ఉచితంగా అందించబడునని ఆయన పేర్కొన్నారు. ప్రవేశ దరఖాస్తుల కోసం విద్యార్థులు తమ ఆధార్‌కార్డ్ జీరాక్స్, 2 పాస్‌ఫోర్ట్ సైజ్ ఫోటోలు, పాఠశాల బోనాఫైడ్, కుల ఆధాయ ధృవీకరణ పత్రాలతో హస్టల్ నిర్వాహణాధికారిని కార్యాలయంలో సంప్రదించాలని, సందేహాలకు 7780318203 నెంబరును సంప్రదించవచ్చని తెలిపారు.

బాలల హక్కుల రక్షణకు కృషి చేయాలి

- న్యాయవిజ్ఞాన వేదిక సెక్రటరీ యువరాజ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని సీనియర్ సివిల్ జడ్జి న్యాయ విజ్ఞాన వేదిక సెక్రటరీ యువరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అబ్దుల్ కలాం పాఠశాలలో బాల కార్మిక నివారణ దినోత్సవ సందర్భంగా న్యాయ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2019లో ప్రత్యేక చట్టాన్ని తీసుకు వచ్చిందని తెలిపారు. దీని ప్రకారం సమాజంలోని పిల్లలకు తప్పనిసరిగా విద్య వైద్యం అందేలా చూడాలన్నారు. జిల్లాలో అనేక గిరిజన ప్రాంతాలు ఉన్నాయని వీటిలో ఉన్న బాలబాలికలకు మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా పౌష్టికాహారం అందించాలని సూచించారు. మారుమూల ప్రాంతాల్లో పిల్లలకు అవగాహన కల్పించి వారి హక్కులను రక్షించాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందని అన్నారు. బాలలు ఎక్కడ కూడా పనిలో ఉండకుండా చూడాలని సూచించారు. బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నరహరి, కిషోర్, పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు విద్యలో రాణించాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఆర్యవైశ్యులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి సూచించారు. ఆదివారం స్థానిక వాసవి గార్డెన్‌లో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో పది, ఇంటర్‌పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన ఆర్య వైశ్య విద్యార్థులను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా గుల్బం చక్రపాణి మాట్లాడుతూ మున్ముందు కూడా ఇదే ప్రతిభను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాసం శ్రీనివాస్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాచకొండ గిరీష్‌కుమార్, కౌన్సిలర్ స్వామిశెట్టి రాజేందర్, సంఘం జిల్లా ఉపాధ్యక్షులడు కొలిపాక కిరణ్‌కుమార్, కోశాధికారి మైలారపు సుగుణాకర్‌తో పాటు యువజన, మహిళా సంఘం జిల్లా కమిటీ, పట్టణ కమిటీ సభ్యులు, వాసవి సేవాదళ్, వాసవి సేవ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్, సామూహిక లైంగిక దాడికి యత్నం

- ఇద్దరు యువకులపై కేసు నమోదు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మైనర్ బాలికను కిడ్నాప్ చేసి ఇద్దరు యువకులు సామూహిక లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించిన సంఘటన ఆదివారం రాత్రి కాగజ్‌నగర్‌లో చోటు చేసుకుంది. బాధిత బాలిక కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన ప్రకారం.. స్థానిక బాలాజీనగర్‌కు చెందిన బాలిక(15) ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటి ముందు ఉండగా ఆదర్శనగర్‌కు చెందిన ఇద్దరు యువకులు అభిలాష్, విజయ్‌లు వచ్చి బాలిక నోటి వద్ద ఖర్చీఫ్‌తో వాసన చూపించి ఆదర్శనగర్‌లోని నిర్మానుష్యప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ ఆ బాలికకు గంజాయి వాసన చూపించి మత్తులోకి వెళ్లాక ఆమెపై లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించారు. రాత్రి 12 గంటల సమయంలో బాలిక తల్లి అనుమానంతో ఒక యువకుని ఇంటి వద్దకు వెళ్లి ఆరా తీసింది. దీనితో కుటుంబసభ్యులు ఆ యువకునితో ఫోన్‌లో మాట్లాడి నీ కోసం పోలీసులు ఇంటికి వచ్చారని తెలియపర్చడంతో భయంతో ఆ ఇద్దరు యువకులు బాలికను విడిచిపెట్టి పరారీ అయ్యారు. మత్తు నుండి తేరుకున్న బాలిక ఆదర్శనగర్ నుండి వస్తుండగా అప్పటికే గాలిస్తున్న తల్లికి తారసపడింది. గాయాలతో ఉన్న బాలికను స్థానిక ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. సోమవారం ఉదయం బాధిత బాలికతో పాటు, తల్లి నుండి ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దరు యువకులపై ఫోక్సో, కిడ్నాప్, అత్యాచారయత్నం కేసులు నమోదు చేసినట్లు టౌన్ సీఐ బుద్దె స్వామి తెలిపారు.

'సింగరేణి కార్మికులకు కేసీఆర్ చేసింది శూన్యం'



నవతెలంగాణ-నస్పూర్

ఇటీవల మంచిర్యాల జిల్లా సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించడానికి వచ్చిన సీఎం కేసీఆర్ మంచిర్యాల జిల్లా ప్రజలకు, సింగరేణి కార్మికులకు చేసిందేమీ లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ ఆరోపించారు. సోమవారం నా స్పోర్ట్స్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో మంచిర్యాల జిల్లా ప్రజలు, సింగరేణి కార్మికులు సకల జనుల సమ్మె చేసినా కూడాముఖ్యమంత్రి వారిని గుర్తించలేదన్నారు. సింగరేణి కార్మికులకు లాభాల వాటా ప్రకటించడం కొత్తేమి కాదని, దానిని గత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో సింగరేణిలో ఇచ్చిన హామీలను విస్మరించారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.20 వేల కోట్ల పైగా సింగరేణికి అప్పుందని తెలిపారు. కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారే తప్ప కార్మికులకు ప్రత్యేకంగా చేసిందేమీ లేదని అన్నారు. దేశంలో 1250 మిలియన్ టన్నుల బొగ్గు అవసరం ఉండగా, వివిధ సంస్థల నుండి 1000 మిలియన్ టన్నుల బొగ్గును మాత్రమే ఉత్పత్తి చేస్తుందని, మిగతా బొగ్గును విదేశాల నుండి తీసుకురావడం జరుగుతుందని పేర్కొన్నారు, ముఖ్యమంత్రి హోదాలో ఉండి ఈ మాత్రం కూడా తెలియక, అనవసరంగా విదేశాల నుండి బొగ్గు కొంటున్నారని మోడీని విమర్శించడం తగదని అన్నారు. సింగరేణి కార్మికులపై ప్రేమాభిమానాలు ఉంటే పెర్క్స్ పై ఐటి మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే శాలువాను బహుకరిస్తుండగా అవమానపరచడాన్ని మంచిర్యాల జిల్లా ప్రజలను అవమానపరచడమేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అగల్ డ్యూటీ రాజు, నాయకులు సత్రం రమేష్, పానుగంటి మధు, సిరికొండ రాజు, మిట్టపల్లి మొగిలి పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా 2.5కె రన్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడా మైదానంలో 2.5కె రన్ నిర్వహించారు. దీనిని జడ్పీ వైస్ ఛైర్మన్ కోనేరు కృష్ణారావు, డీఎస్పీ కరుణాకర ప్రారంభించారు. ఈ రన్ ఎస్పీఎం క్రీడా మైదానం గుండా సాగి లారీ చౌక్, ఎన్టీఆర్ చౌక్ మీదుగా తిరిగి ఎస్పీఎం క్రీడా మైదానం వరకు సాగింది. దీనిలో ప్రథమ స్థానాన్ని వినయ్, ద్వితీయ స్థానాన్ని తేజ సాధించారు. పోలీసు విభాగంలో నయీం ప్రథమ, వినయ్ ద్వితీయ, మహిళా విభాగంలో కౌసర్ భాను ప్రథమ, టియా ద్వితీయ స్థానం సాధించారు. వీరికి డీఎస్పీ కరుణాకర్, సీఐలు బుద్దె స్వామి, సాదిక్‌పాషాలు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మైదానంలో న్యూట్రిషన్ ప్లస్ డాక్టర్ సుమిత్ బృందం ఏరోబిక్స్ ప్రదర్శించింది. మార్వాడి జాగృతి సమాజ్ ఆధ్వర్యంలో పండ్లు, పానీయాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ కాసం శ్రీనివాస్, కాగజ్‌నగర్ పోలీసు సబ్ డివిజన్‌లోని పోలీసులు, పట్టణవాసులు పాల్గొన్నారు.

స్టేషన్‌కు వచ్చేవారికి బాసటగా నిలవాలి

ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారికి పోలీస్ అధికారులు బాసటగా నిలవాలని ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వచ్చిన సమస్యల పట్ల ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో ఎంతైతే నిబద్ధతతో పోలీసు సిబ్బంది పనిచేస్తున్నారో బాధితుల సమస్యల పరిష్కారం కోసం అంతే నిబద్ధతతో పని చేయాలన్నారు. పోలీస్ పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిదిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. అలాగే చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిస్థితులకు భంగం కలిగించేవారి పట్ల, మహిళలకూ వ్యతిరేకంగా జరిగే నేరాల పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలి

ఆసిఫాబాద్ : జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. పాఠశాలల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఎంపీపీఎస్ గోవిందపూర్, గుండి పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి స్కూల్ యూనిఫార్మ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల సంఖ్యను పెంచాలన్నారు. మన ఊరు-మన బడి కింద జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులకు సంబంధించి ఎస్ఎంసి ఛైర్మన్, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు ప్రైవేటు పాఠశాల నుండి ప్రభుత్వ పాఠశాలకు అధిక సంఖ్యలో వస్తున్నారని వారికి పాఠశాలలను అన్ని రకాల సౌకర్యంతో స్వాగతం పలకాలని, గుణాత్మక విద్యను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు స్వరూప, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మిషన్ భగీరథలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఏఓ రఫత్ హుస్సేన్‌కు కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. కనీస వేతనాలు రూ.24000 అమలు చేయడంతో పాటు రెగ్యులరైజ్ చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులకు ఒకే రకమైన వేతనాలు చెల్లించాలని ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. భగీరథ కార్మికులకు ప్రతి నెల పెట్రోల్ అలవెన్స్‌లు చెల్లించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగిన కార్మికుల కుటుంబాలకు రూ.20 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. జీఓ నెంబర్ 60 లేదా జీఓ నెంబర్ 11 అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు వారికి అండగా ఉండి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికుల సంఘం నాయకులు బాలేష్, కుమార్ పాల్గొన్నారు.

ఫోర్ మెన్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా వర్క్ షాప్‌లో విధులు నిర్వహిస్తున్న ఫోర్ మెన్ పై చర్యలు తీసుకోవాలని వర్క్ షాప్ డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డికి హెచ్ఎంఎస్ నాయకులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏరియా వర్క్ షాప్‌లో పనిచేస్తున్న ఫోర్ మెన్ కార్మికుల పట్ల దురుసుగా మాట్లాడడం, దుర్భాషలాడటం, వేధింపులకు పాల్పడడం, ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, వారికి సంబంధంలేని పనులు చేయాలని వేధిస్తున్నారన్నారు. రెస్ట్ రూములకు తాళాలు వేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో కూడా ఇతనిపై ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడంలేదని, ఎంవీ డ్రైవర్ ఇతని వేధింపులు భరించలేక టింబర్ యార్డ్‌కు బదిలీ చేయించుకొని వెళ్లిపోవడం జరిగిందన్నారు. ఇతని ప్రవర్తనపై ఫిర్యాదు చేయడానికి కూడా కార్మికులు భయపడుతున్నారని, నాకు ఉన్నతాధికారులు, టీబీజీకేఎస్ అండదండలు ఉన్నాయని ఒక నియంతల వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇతనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హెచ్ఎంఎస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. నాయకులు తిప్పరపు సారయ్య, అనిల్ రెడ్డి పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

నేటి పరిస్థితులలో విలువలతో కూడిన విద్యను అందించాలని, శ్రీ సరస్వతి శిశుమందిరాలు ఆ కోవలోకే వస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం కాగజ్‌నగర్‌లోని బాలాజీనగర్ శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యాలయానికి రూ.50 వేల విలువ చేసే బెంచీలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో డిజిటల్ తరగతులు, పోటీ పరీక్షలకు శిక్షణ, చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతుల నిర్వహణ, క్రీడా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ఈ విద్యాలయం ముందంజలో ఉందని అన్నారు. విద్యార్థులు కూడా మంచిగా విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి కోసం శిశుమందిరాల అధ్యక్షురాలు డాక్టర్ అనిత కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనితతో పాటు హితహిషులు ఇందూరి వెంకటేష్, వాడపల్లి గరుడాచలం, జిల్లా సభ్యురాలు భారతి, అనిల్‌తో పాట పోషకులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నస్పూర్



టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య జన్మదిన వేడుకలు శ్రీరాంపూర్‌లోని శ్రీసాయి అందులో పాఠశాలలో టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో వర్కింగ్ ప్రెసిడెంట్ పాల్గొని పండ్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లయ్య అద్వర్యంలో అనేక హక్కులు సాధించడం జరిగిందని, కార్మిక నాయకునిగా అనేక సేవలందించిన మల్లయ్య మరిన్ని పుట్టిన రోజులు జరుపుకోవాలని, కార్మికుల హక్కుల కాపాడడంలో మరింత చురుకుగా పాల్గొనాలని, వారికి ఆయురారోగ్యాలని ప్రసాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేంద్ర నాయకులు ఏనుగు రవీందర్‌రెడ్డి, మంద మల్లరెడ్డి, ఏరియా నాయకులు ల్యాగల శ్రీనివాస్, గోరిగే చేరాలు, గోపి నాయక్, వివిధ గనుల పిట్ సెక్రటరీలు మహేందర్‌రెడ్డి, ఎంబడి తిరుపతి, మెంద వెంకటి, పెగ మల్లయ్య, కందుల శంకరయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

2కే రన్‌ను ప్రారంభించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్



దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో సోమవారం 2కే రన్‌ను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ 2కే రన్ ఎన్టీఆర్ స్టేడియం నుంచి మంచిర్యాల చౌరస్తా వరకు నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో సీఐ నారాయణ నాయక్ పర్యవేక్షణలో 2కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ముందు ఎమ్మెల్యే రేఖ నాయక్ పచ్చజెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలీస్ స్టేషన్ నుండి మొదలైన 2కే రన్‌లో దాదాపు 400 మంది వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక యువత, రాజకీయ నాయకులు కలిసి పట్టణ పొలిమేరలోని సాయిబాబా ఆలయ మైదానం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ఎంపిక చేశారు. విజేతలకు జిల్లా ఎస్పీ సమక్షంలో ప్రశంసపత్రాలను అందజేయనున్నట్లు సీఐ నారాయణ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్కిల్ పరిధిలోని ఎస్సైలు శంకర్, ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ వినాయక్, అటవీశాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

కేజీబీవీ ఉద్యోగులకు ఇచ్చిన పోస్టింగులు రద్దు చేయాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2022 సెప్టెంబర్ 7వ తేదీన కాగజ్‌నగర్ కేజీబీవీలో చదువుతున్న ఐశ్వర్య మృతికి సంబంధించి, అదే కేజీబీవీలో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేశారని, తాజాగా వారికి ఇచ్చిన పోస్టింగులు రద్దు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేజీబీవీలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను సంఘటనకు సంబంధించి సస్పెండ్ చేశారని, తిరిగి వారిని తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. రెగ్యులర్ ఉద్యోగులను సస్పెండ్ చేసి తిరిగి తీసుకోవడం సాధారణమైనప్పటికీ కాంట్రాక్టు విధానాల్లో పనిచేస్తున్న వారిని తిరిగి తీసుకోవడంలో అధికారుల ఆత్రుత ఎక్కువగా కనిపిస్తుందని అన్నారు. వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో భవిష్యత్తులో మిగతా వారికి కూడా ఎటువంటి భయం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇచ్చిన పోస్టింగులు రద్దు చేయకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ పోస్టుల భర్తీ కోసం ప్రోత్సహించిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కొరెంగ మాలశ్రీ, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్ పాల్గొన్నారు.

ఈవీఎం వీవీ ప్యాట్ల భద్రతకు పటిష్ట చర్యలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల నిర్వహణ కోసం ఉపయోగించే ఈవీఎం వివి ప్యాట్ల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్స్‌ను అదనపు కలెక్టర్ రాజేశం, ఆర్డీఓ రాజేశ్వర్‌తో కలిసి వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎం, వివి ప్యాట్ల భద్రత కోసం పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈవీఎంలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. రానున్న వారం రోజులపాటు పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల పనితీరు పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈవీఎంల బ్యాటరీలను మార్చి వాటిని సిద్ధం చేయాలని సూచించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈవీఎంలు సిద్ధంగా ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు గాదవేణి మల్లేష్, బద్రి సాయి, ఆత్మారాం, సలాం, సల్మాన్, చరణ్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల ముందు చిన్నబోయిన ఎండ

- ప్రజావాణికి పోటెత్తిన అర్జీదారులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో వారం రోజులుగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నప్పటికీ అవేవీ లెక్కచేయకుండా సమస్య పరిష్కారమే లక్ష్యంగా కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి జిల్లాలోని వివిధ మండలాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆర్డీవో రాజేశ్వర్ అర్జీదారుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున అర్జీదారులు రావడంతో కలెక్టరేట్ సందడిగా మారింది.

బడిబాట పట్టిన విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా బడి గంట మోగింది. సోమవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా యాజమాన్యాలు అన్ని చర్యలు చేపట్టాయి. పాఠశాలలను ముస్తాబు చేసి, తోరణాలు కట్టి, ముగ్గు వేసి విద్యార్థులకు స్వాగతం పలికారు. పలుచోట్ల చప్పట్లతో ఉపాధ్యాయులు విద్యార్థులను ఆహ్వానించారు. విద్యార్థులు చాలా రోజుల తర్వాత స్నేహితులను కలుసుకొని ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. దీంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.

పాఠశాలను సందర్శించిన విద్యాశాఖాధికారి

వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పున్ణప్రారంభమైన సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2ను జిల్లా విద్యాశాఖాధికారిణి ప్రణీత సందర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు చాక్లెట్లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య వచ్చినప్పుడు స్పందనే ప్రదానం

నవతెలంగాణ-నిర్మల్

ప్రజలకు సమస్య వచ్చినప్పుడు పోలీసుల స్పందనే ప్రధానమని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఫిర్యాదుదారులు తమ సమస్యలను ఎస్పీకి అర్జీల రూపంలో తెలియజేశారు. సమస్యలను తెలుసుకొని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సామాన్య ప్రజలకు పోలీసు అండగా ఉండాలని, వారితో స్నేహభావంగా మెసులుకోవాలని తెలిపారు. పోలీసుల సహాయం కావాలనుకున్న వారు పోలీస్‌స్టేషన్‌లో నిర్భయంగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

జూన్ 22 నుండి గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 22 నుండి సమ్మెకు వెళ్తామని తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మిక, కారోబారి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఆదిలాబాద్ డీపీఓకు సమ్మె నోటీసులు అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలను ఇవ్వాలని అన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీఓ నెంబర్ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారోబారి బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని అన్నారు. కార్మికుల ఇతర డిమాండ్లను పరిష్కరించాలని లేనిపక్షంలో రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జూన్ 22న సమ్మెకు వెళ్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌రావు, గ్రామపంచాయతీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, సోనేరావు, ఇంద్రజ్, యూనియన్ నాయకులు సుందర్,



యశ్వంత్, లక్ష్మణ్ దశరథ్, సంగీత, రాధమ్మ పాల్గొన్నారు.

సర్పంచ్ విన్నపాలను పట్టించుకోని అధికారులు

- సర్వసభ్య సమావేశంలో నాగాపూర్ సర్పంచ్ అధికారులపై ఆగ్రహం



నవతెలంగాణ-ఉట్నూర్

గ్రామపంచాయతీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్‌గా అధికారులను కలిసి విన్నవిస్తే పట్టించుకోవడం లేదని సర్వసభ్య సమావేశం వేదికపై నాగాపూర్ సర్పంచ్ జాదవ్ సునిల్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్యసమావేశం ఎంపీపీ పంద్ర జైవంత్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రేఖా నాయక్ హజరయ్యారు. గ్రామాల్లో విద్యుత్ స్తంబాలు, లైన్, వంగిన స్తంబాల తీసివేయడం తదితర సమస్యలను పరిష్కరించాలని గతంలో ట్రాన్స్‌కో ఏఈకి విన్నవిస్తే ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదని సభాముకంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలకు సేవలందించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం కేసీఆర్ ప్రభుత్వం తప్పిదమేనని ఆరోపించడంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే అధికారుల తప్పు వల్ల కేసీఆర్‌ను విమర్శించడం తగదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాతనే సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రాన్ని దేశంలో అభివృద్ధిలో ముందంజలో నిలిచేల కృషి చేస్తున్నారని అన్నారు. వెంటనే ట్రాన్స్‌కో ఎస్ఈతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అదే విధంగా ఇంటింటికి నల్లా నీరు అందించడం కోసం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకంలో అవినీతి జరిగిందని, ఎక్కడికక్కడ పైపులు, నల్లాపైపులు పగిలిపోవడంతో తాగునీరు రావడం లేదని, లక్కారం సర్పంచ్ జనార్థన్ అధికారులను నిలదీశారు. ప్రతి గ్రామంలో నల్లానీరును అందిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేందర్ తెలపడంతో స్పందించిన ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. విమర్శలు మానుకోని అభివృద్ధికి పాటు పడాలని అన్నారు. అధికారులు నిత్యం గ్రామాల్లో పర్యటించాలని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అన్నారు. కొన్ని కొన్ని గ్రామపంచాయతీలలో ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులు చేయకపోవడంతో ప్రభుత్వం చొరవ తీసుకోని అభివృద్ధి పనులు చేయించడం జరుగుతుందని అన్నారు. అనంతరం విద్య, వైద్యం, తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీడీఓ తిరుమల, పీఏసీఎస్ చైర్మెన్ ప్రభాకర్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమ పట్టాలను రద్దు చేసి డబుల్ బెడ్ రూమ్‌లు కట్టివ్వాలి

నవతెలంగాణ-నిర్మల్

అక్రమ పట్టాలను రద్దు చేసి, పేదలకు డబుల్ బెడ్ రూమ్‌లు కట్టి ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే.రాజు అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. డీఆర్వో లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 1983లో 5ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం హంపోలి గ్రామ నిరుపేదలకు ఇండ్ల స్థలాలు మంజూరు చేసి, ఇండ్లు నిర్మించిందని అన్నారు. ఈ అసంపూర్ణ ఇండ్లు అలాగే ఉండగా, ధరణిని ఆసరా చేసుకున్నా అక్రమదారులు, అక్రమ పట్టా చేసుకొని, ఇండ్లను కూల్చారని అన్నారు. ఒక్కొక్క ఇరుకు ఇంట్లో 3, 4 కుటుంబాలు ఇబ్బందులు పడుతూ బ్రతుకు ఈడుస్తున్నారని అన్నారు. ఉన్న ఇండ్ల స్థలాలను అవినీతికి పాల్పడి పట్టా చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. ఈ అక్రమ పట్టాల రద్దుకై అనేక సంవత్సరాలుగా ప్రజలు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. ఈ అక్రమ పట్టా చేసిన రెవెన్యూ సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అక్రమ పట్టాలను రద్దుచేసి, పేదలకు స్వాధీనం చేయకపోతే, ఆక్రమణకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.హరిత, గోపి నర్సయ్య, గొనె స్వామి, వెంకటేష్, విఠల్, అనిల్, సాయినాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాడుతాం

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాడుతామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ప్రజా ఆకాంక్ష దీక్షా దివస్ భారీ ప్రదర్శనతో జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్, కూరగాయల మార్కెట్, మీదుగా రాంజీ గోండు, విగ్రహం వైపు నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీని సోమవారం నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డీఆర్వో లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి దశాబ్దమైందని అన్నారు. సాధించింది గోరంత అయితే కొండంత సాధించినట్లు ప్రజల ఆకాంక్షలు నెరవేరినట్లు సంబరాలు చేస్తూ ప్రభుత్వం తరపున దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. కానీ ప్రజల ఆకాంక్షలను ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం మర్చిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా



ప్రజలకు ఇచ్చిన హామీలను కట్టుబడి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ గిరిజనులు ఇతర పేదలు సాగు చేసుకుంటున్న అటవీ భూములన్నింటికీ హక్కు పత్రాలు ఇవ్వాలని అన్నారు. రైతుల రుణాలను మొత్తంగా మాఫీ చేయాలని అన్నారు. అలాగే కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలని అన్నారు. నిరుద్యోగులందరికీ పదివేల రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వాలని అన్నారు. బీడీ కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ హామీ ప్రకారంగా జీవనభృతి ఇవ్వాలని, అర్హులైన వారికి రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇండ్ల స్థలాలు, అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని అన్నారు. ఇంటి స్థలం ఉన్నవారికి నిర్మాణానికి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల ఇవ్వాలని అన్నారు. అదేవిధంగా ధరణి వెబ్‌సైట్ అవకతవకలను వెంటనే సవరింప చేయాలని అన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇవ్వాలని, ఉపా చట్టం రద్దు చేయాలని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, అనుబంధ సంఘాల నాయకులు రామ్ లక్ష్మణ్, బక్కన్న, గంగన్న, అంకుష్, మహమూద్, కే.లక్ష్మి, మహేందర్, లక్ష్మి, నవీన్, జక్కుల రాజన్న, సుదర్శన్, గొరెబాయి, రాజారాం పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఏదైనా సాధించొచ్చు

నవతెలంగాణ-నస్పూర్

శారీరక ధృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైనా సాధించవచ్చని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ అవతరణ, దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెలంగాణ రన్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఏసీపీ తిరుపతిరెడ్డి, జిల్లా క్రీడా యువజన సర్వీసుల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డిలతో కలిసి జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు 2కే రన్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శారీరక ధృఢత్వం ఉంటే ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. యువత ప్రతి రోజు పరుగు, వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని అన్నారు. ఆరోగ్యవంతమైన తెలంగాణ కొరకు ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గత 9సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ పాలనలో సాధించిన విజయాలను ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రభుత్వం ఈ నెల 2 నుంచి 22వ తేదీ వరకు 21 రోజుల పాటు వేడుకలు నిర్వహించ తలపెట్టిందని, ఈ ఉత్సవాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం వైద్య కళాశాలలు, సమీకృత కలెక్టరేట్లు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, ఆసరా పెన్షన్లు, కేసీఆర్ కిట్, సమీకృత కూరగాయల మార్కెట్ లాంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-బోథ్

మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన గుండం బోజన్న (56) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. తనకున్న ఒక ఎకరంలో పత్తి సాగు చేశాడు పెట్టిన పెట్టుబడికి దిగుబడి రాక గత వారం రోజుల నుంచి కలత చెందేవాడు. సోమవారం తన ఇంట్లో ఉన్న పురుగులమందు తాగాడు గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను బోథ్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో రిమ్స్‌కు తరించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు ప్రయివేటు అప్పులు రూ.5 లక్షలు ఉన్నాయని తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

ఎస్సైపై దాడిచేసిన వారికి జైలుశిక్ష

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఈశ్వర్‌నగర్ 2019లో గ్రామంలో ఓ కేసులో విచారణకు వెళ్లిన అప్పటి ఎస్సై.అరికిల్ల గంగారాంతో పాటు పోలీసులపై దాడిచేసిన ఘటనలో 8 మందిపై 6 నెలల జైలు శిక్ష లేదా ముప్పై వేలు జరిమానా విధించినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఎస్సీ,ఎస్టీ ప్రత్యేక కోర్టులో పీపీ కిరణ్ కుమార్‌రెడ్డి సాక్షులను ప్రవేశ పెట్టగా సోమవారం జిల్లా కోర్టు న్యాయూర్తి శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు.

ఉపాధి హామీలో చేతివాటం



నవతెలంగాణ-చింతలమానేపల్లి

ఉపాధి హామీ చట్టంలో అధికారులు అవినీతికి పాల్పడ్డారని సోషల్ అడిట్ బృందం సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మండలంలో 2021 డిసెంబర్ నుంచి 2023 మార్చి వరకు రూ.8.50కోట్ల నిధులతో చేసిన పనులపై ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, డీఆర్డీఓ సురేందర్ హాజరయ్యారు. 15 గ్రామపంచాయతీల్లో పనుల్లో ఏపీఓ మొదలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీర్ కన్సల్టెంట్, పంచాయతీ కార్యదర్శులు ఇలా అందరూ నిర్లక్ష్యంగా చట్టానికి తూట్లు పొడుస్తూ కూలీలకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. ఇటు ప్రజాధనం దుర్వినియోగం జరిగిన విషయం బయటపడింది. నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో ఆశా కార్యకర్తకు, గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్‌లకు ఉపాధి కూలీలుగా చేర్చి పనులు కల్పించి, కూలీ చెల్లించడం బయటపడింది. గతంలో ఇక్కడ పని చేసిన ఏపీఓ రాజన్న గత సోషల్ ఆడిట్‌లో అబ్జెక్షన్‌లు, రికవరీ క్లియర్ చేసుకోకపోవడమే కాక ప్రతి పనిలో చేతివాటం ప్రదర్శించినట్టు గుర్తించారు.

పద్మశాలీలను ప్రభుత్వం ఆదుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

పద్మశాలీలను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిలభారత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కందగట్ల స్వామి, మండల అధ్యక్షుడు శెట్టిపల్లి గంగయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పద్మశాలి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశాలీలకు ప్రతి మండలంలో పద్మశాలి భవన్ ఏర్పాటు చేయాలన్నారు. పద్మశాలిలకు ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రతి పద్మశాలి కులస్తుడు విధిగా సభ్యత్వ నమోదును తీసుకొని ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని కోరారు. 18 ఏండ్లు నిండిన ప్రతి పద్మశాలి యువకుడు తప్పనిసరిగా ఈ సంఘంలో సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షులు మచ్చ ప్రభాకర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు, సత్తుపల్లి సత్యం, ఆయ్యెరు వీరయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, డాక్టర్ సారంగపాణి, డాక్టర్ దశరథం, దోమల చిరంజీవి, శ్రీనివాస్, నిలేష్, అంజన్న చెటుపెల్లి శంకరయ్య, గౌడ అంజన్న, మల్లేష్, తుమ్మ మల్లేష్, చెటుపెల్లి రాజన్న, రాజ గురువయ్య, దేవసాని నాగరాజు, సాంబారి కుటుంబరావు, నల్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకున్ని సన్మానించిన పోలీస్ అధికారులు

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధి షెట్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మేడి తిరుపతిని శ్రీరాంపూర్ సీఐ రాజు ఆధ్వర్యంలో సోమవారం పలువురు పోలీసులు శాలువాతో సన్మానించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధి జైపూర్ సబ్ డివిజన్ చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన 2కే రన్ సందర్భంగా యువకులతో పాటు తరలివచ్చిన మేడి తిరుపతిని అబినందించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి, జైపూర్, శ్రీరాంపూర్ ఎస్సైలు పాల్గొన్నారు.

శివాలయంలో శివలింగ విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని చింతగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో శివలింగ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ పొలిమేర నుంచి గ్రామస్తులు నూతన శివాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ శివలింగ విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా ఖానాపూర్ బీఆర్ఎస్ నాయకులు జాన్సన్ నాయక్ శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆలయ నిర్వాహకులు జాన్సన్ నాయక్‌ను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆరే జ్యోతి శిరీష్, వైస్ ఎంపీపీ ఆ గ్రామ ఎంపీటీసీ సుత్తారి వినయ్ కుమార్, ఆలయ కమిటీ నిర్వాహకులు మేడ మురళి, సత్యనారాయణ, రాజన్న మల్లేష్ శ్రీనివాస్ వెంకటేష్ పాల్గొన్నారు.